సాక్షి
గుంటూరు

11

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024

బాధితులందరికీ సరుకులు



గుంటూరు వెస్ట్: వరద బాధితుల కోసం నందివెలుగు రోడ్డులోని పౌరసరఫరాల గిడ్డంగుల్లో సిద్ధం చేస్తున్న నిత్యావసర సరకుల ప్యాకింగ్ కిట్లను బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. తాడికొండ, గుంటూరు అర్బన్, రూరల్, మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన 2,007 కుటుంబాలకు ఈ కిట్‌లను పంపిస్తున్నామని తెలిపారు. పౌరసరఫరాల సంస్థ డీఎం లక్ష్మి, వెస్ట్ తహసీల్దారు నగేష్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పసుపు పంట



కరకట్ట దిగువన 5 ఎకరాలను రూ.50 వేల చొప్పున కౌలుకు తీసుకుని పసుపు సాగు చేస్తున్నాను. కృష్ణా నదికి వరద రావటంతో మొక్క దశలో ఉన్న పసుపు పూర్తిగా వరదలో మూడు రోజులు ఉంది. తర్వాత మొక్కలు బయటపడ్డాయి. వెళ్లి పరిశీలిస్తే పంట పూర్తిగా కుళ్లిపోతోంది. ఎకరానికి రూ.లక్ష వరకు ఇప్పటికే పెట్టుబడి పెట్టా. దీంతో భారీగా నష్టపోయా. ఇలాంటి సమయంలో మాలాంటి కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– నిమ్మ గోపి, కౌలు రైతు, హనుమాన్‌పాలెం

ఎకరాకు రూ.లక్ష ఇవ్వాలి



కృష్ణా నది కరకట్ట దిగువన 5 ఎకరాల పొలం ఉంది. 3.5 ఎకరాలలో పసుపు, మిగతా దాంట్లో అరటి సాగు చేస్తున్నా. అరటి దిగుబడి తగ్గినా కొంత పంట చేతికి వస్తుంది. కానీ పసుపు చిన్న మొక్క దశలో ఉన్నందున నీటిలో నాని దుంప కుళ్లింది. పంట నాశనం అవుతోంది. ఇక పూర్తిగా పనికి రాదు. దున్ని ఇక్కడ రెండో పంట వేయటం మేలు. ఎకరానికి రూ.లక్ష ఖర్చు పెట్టా. ప్రభుత్వం ఎకరానికి రూ.లక్ష పరిహారం ఇచ్చి రైతులు అప్పులపాలు కాకుండా కాపాడాలి.

– అరవపల్లి బసవ పున్నయ్య, రైతు, తూములూరు

వరదపాలైన పెట్టుబడి



కృష్ణా నది కరకట్ట దిగువన 1.40 సెంట్లు పొలంలో 400 గులాబీ మొక్కలు నాటా. పెట్టుబడి మొత్తం రూ.లక్ష వరకు అయింది. వరద కారణంగా చిన్న మొక్కలకు ఒండ్రు మట్టి పట్టింది. వరద మూడు రోజులు ఆగడంతో కొన్ని మొక్కలు చనిపోయాయి. మరికొన్ని కుళ్లిపోయాయి. సుమారు 100 మాత్రమే మిగిలాయి. వరదతో రూ.లక్ష పెట్టుబడి నీటిపాలైంది. ఇప్పుడు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– నిమ్మ మణిబాబు, రైతు, పాత బొమ్మువానిపాలెం

పరిష్కారం చూపాలి



మా ప్రాంతంలో వర్షం కురిసేది చాలా తక్కువ. చుట్టుపక్కల ఎక్కడ ఏ కొండల మీద వానలు పడినా ఆ వరదంతా వచ్చి ఆగేది మా ఊరి పొలాల్లోనే. వారం రోజుల వరకు నీళ్లు పోవు. పంటలు కుళ్లి ఉరకెత్తిపోతాయి. గత్యంతరం లేక మరో పంట సాగు చేస్తాం. అదీపోతే ఇంకొకటి. రైతులు పడుతున్న అగచాట్లను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– పదాల వీరశేఖర్‌రావు, రైతు, వంగిపురం

పంటలపై వరద పంజా

- కాస్త తగ్గిన ఉధృతి
- బయటకు కనిపిస్తున్న పంటలు
- పలుచోట్ల కుళ్లిపోయిన సాగు
- తేరుకునే వీల్లేకుండా రైతులకు నష్టం
- ప్రభుత్వమే ఆదుకోవాలని వినతి

కృష్ణా నది వరద ప్రవాహానికి మండల పరిధిలోని కరకట్ట దిగువన సాగు చేస్తున్న వాణిజ్య పంటలు నీట మునిగాయి. బుధవారం పలు ప్రాంతాల్లో పొలాలను చూసిన అన్నదాతలకు కన్నీరే మిగిలింది. అరటి, పసుపు, కంద, మొక్కజొన్న, కూరగాయలు, పూల సాగు తీవ్రంగా దెబ్బతింది. రైతులు కోలుకోలేని నష్టం చవి చూశారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టిన పంటలు కొట్టుకుపోయాయి. ఉన్నవి నీటిలో నాని కుళ్లిపోయాయి.

కొల్లిపర: మండల పరిధిలోని వల్లభాపురం, పిడపర్రు, పాత బొమ్మువానిపాలెం, అన్నవరపు లంక, కొత్తూరు లంక గ్రామాలలో సుమారుగా 1,500 ఎకరాలకుగాను వరదతో సుమారు 1,000 ఎకరాలలో పంటనష్టం వాటిల్లింది. కృష్ణా నది వరద ఉధృతి మంగళవారం తగ్గుముఖం పట్టింది. బుధవారం మరికొంత తగ్గేసరికి పొలాల్లో నీరు బయటకు పోవడంతో పంటలు సగం కనిపించాయి. ఆయా రైతులు పొలంలోకి వెళ్లి పంట నష్టాన్ని పరిశీలిస్తున్నారు. పంట కుళ్లిపోవటం, వడిల్లిపోవటం, మట్టిబారటం, నేలరాలిపోడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసుపు, పూలు, కూరగాయల సాగు పూర్తిగా దెబ్బతింది. పూర్తిగా పంట తీసి రెండో పంటను సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పసుపు చిన్న మొక్క దశలో ఉండటం వల్ల దుంప కుళ్లింది. ఇప్పటికే ఎకరానికి రూ.1.30 లక్షలు ఖర్చు చేశామని, ఏం చేయాలో పాలుపోవడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే సహాయం అందిస్తే రెండో పంటకైనా పెట్టుబడి సర్దుబాటు అవుతుందని కోరుతున్నారు.



కొల్లిపరలో కృష్ణా నది కరకట్ట దిగువన వరద నీటికి రంగు మారిన పసుపు సాగు



పాత బొమ్మువానిపాలెంలో వరద నీటికి కుళ్లిపోయిన గులాబీ తోట

లంకలు విలవిల

నాలుగు రోజులుగా కృష్ణా వరద నీటిలో లంక గ్రామాలు విలవిలలాడుతున్నాయి. నీటిలో తడిసి చాలా ఇళ్లు కూలాయి. తలదాచుకుందామంటే గూడు లేదు. ఉన్న ఇళ్లు బురదగుంటలుగా మారాయి. టీవీ, ఫ్రిజ్‌లతో పాటు అన్ని వస్తువులు పాడయ్యాయి. వంట పాత్రలు పనికిరాకుండా పోయాయి. బట్టలు, విలువైన పత్రాలు, పిల్లల పుస్తకాలు తడిసి ముద్దయ్యాయి. పంటలు వరదలో చిక్కుకున్నాయి. – సాక్షి ప్రతినిధి, బాపట్ల



భట్టిప్రోలు మండలం లంక గ్రామాలకు ట్రాక్టర్‌పై తరలుతున్న ప్రజలు

భోజనం సంగతి దేవుడెరుగు గుక్కెడు నీటి కోసం లంక గ్రామాలు ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పుడు వరద తగ్గింది. ఇళ్లలో చేరిన బురదను తొలగించడం కష్టంగా మారింది. నిన్నటిదాకా ఇంటినిండా వరద నీరు. ఇప్పుడు బురదను కడుక్కుందామన్నా చుక్కనీరు దొరకడంలేదు. బురదను తొలగించుకునేందుకు కూలీలు కూడా అందుబాటులో లేరు. గోరుచుట్టుపై రోకటి పోటు అనే చందంగా పరిస్థితి ఉందని బాధితులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. అయినా చంద్రబాబు ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా లేదు.

జ్వరాల విజృంభణ

వరద ప్రభావంతో లంక గ్రామాల్లో పలువురు జ్వరాల బారినపడ్డారు. బయట ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి. ముంపువాసుల్లో చాలామంది పేదలు. రెక్కాడితేగానీ డొక్కాడని వారున్నారు. వారంరోజులుగా వారికి పనుల్లేవు. ఈ పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాలంటే వేలకు వేలు కావాల్సిందే. చాలామంది డబ్బుల్లేక లంకల్లోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. బయటకు వచ్చి చూపించుకుందామన్నా ప్రభుత్వం కనీసం బోట్లు ఏర్పాటు చేయలేదు.

బాబు హామీ గాలికి ..

చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తుపాను, వరదల్లో నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ. 20 వేలకు తగ్గకుండా పరిహారం ఇవ్వాలని నాడు వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని నేడు పలువురు లంకగ్రామాల రైతులు గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు తగినంతగా పరిహారం అందజేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మూగజీవాల అరణ్యరోదన

నాలుగు రోజులుగా వరద నీటిలో చిక్కుకున్న వేలాది పశువులు గ్రాసం కోసం అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ముంపులో ఉన్న లంక గ్రామాల్లో వేలాది పశువులు పస్తులతో అల్లాడుతున్నాయి. బుధవారం జిల్లా కలెక్టర్‌తోపాటు కొందరు ప్రజాప్రతినిధులు, పశుసంవర్ధకశాఖ దాణా అందిస్తున్నట్లుగా ఫొటోలకు ఫోజులిచ్చారు.ఎంతమందికి ఇచ్చారంటే శాఖ అధికారులు స్పందించడం లేదు. కానీ క్షేత్రస్థాయిలో బాధిత రైతులందరికీ దాణా ఇవ్వలేదు. మొక్కుబడిగా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. నాలుగు రోజుల వరద పుణ్యమాని వేమూరు, రేపల్లె తోపాటు జిల్లావ్యాప్తంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కృష్ణా నది ముంపు ప్రాంతాలలో దెబ్బతినడంతో గ్రామాలకు రాకపోకలకు వీల్లేకుండా ఉంది.

ఏటా నష్టం.. తీరదు కష్టం!

ఆ గ్రామంలో పొలాలు లోతట్టు ప్రాంతాల్లో ఉన్నాయి.. పైన గ్రామాల్లో ఎక్కడ వర్షాలు కురిసినా ముందుగా మునిగేది ఇవే. ఇక్కడి రైతులు వర్షాన్ని ఎలాగూ ఆపలేరు.. ప్రజాప్రతినిధులను అడగలేరు.. అధికారుల్ని నిలదీయలేరు. కాలువలు బాగు చేయించుకోలేరు. వారికి చేతనైనదల్లా ఒక్కటే.. ఒక పంట మునిగితే మరో పంటను సాగు చేసుకోవడమే. ఇలా ప్రతి ఏడాది నాలుగైదు రకాల పంటలకు ఎదురయ్యే ఇబ్బందులివి. ఇకనైనా పాలకులు ఆదుకోవాలని వంగిపురం గ్రామానికి చెందిన చిన్న, సన్నకారు రైతులు కోరుతున్నారు.

- భారీ వర్షాలతో అన్నదాత ఆగమాగం
- ప్రతిసారీ రూ.లక్షల్లో పంట నష్టం
- శాశ్వత పరిష్కారం చూపని పాలకులు
- తీవ్ర ఆవేదనలో వంగిపురం రైతులు

ప్రత్తిపాడు: వంగిపురంలో పంట కాలువలు అస్తవ్యస్తంగా తయారవ్వడం, వరద నీరు సాఫీగా ముందుకు సాగే మార్గం లేకపోవడంతో పంట పొలాలను వర్షపు నీరు ముంచెత్తడం సర్వసాధారణంగా మారింది. నక్కలవాగు, షరాకత్ కాలువ, రామవాగు, మేకలవాగు, కొండవాగులు ఉధృత రూపం దాల్చిన ప్రతిసారీ ఇవే అవస్థలు. లోతట్టు ప్రాంతాల్లోని పాత మల్లాయపాలెం, తిమ్మాపురం, గింజుపల్లివారిపాలెం గ్రామాలలో ప్రతి సంవత్సరం మూడు వేల ఎకరాలకు పైగా పంట నీట మునుగుతుంది. తాజాగా కురుస్తున్న భారీ వర్షాలకు సైతం వంగిపురంలో వందల ఎకరాల్లో పంట పొలాలు చెరువుల్లా మారాయి.

పదేళ్లలో రూ.కోట్లలో పరిహారం..

వంగిపురం గ్రామంలో పంటలు నీట మునిగినప్పుడల్లా ప్రభుత్వం నుంచి రూ. లక్షల్లో రైతులకు పంట పరిహారం కింద నగదు చెల్లిస్తారు. ఈ గ్రామంలో గత ఏడాది సుమారు 675 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. అంతా నీటిపాలవ్వడంతో సుమారు రూ. 45 లక్షలు పరిహారంగా చెల్లించారు. అలా గడిచిన పదేళ్లలో ఏడెనిమిది సార్లు వరదలకు పొలాలు నీట మునిగాయి. ప్రతిసారీ సుమారు రూ. 25 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు ఉద్యాన శాఖ నుంచి పరిహారం కింద చెల్లిస్తున్నారు. ఇక వరి, పత్తి, మినుము, పొగాకు వంటి పంటలకు గతేడాది సుమారు రూ. 10 లక్షల వరకు పరిహారంగా చెల్లించారు. గడిచిన పదేళ్లలో ఈ మొత్తం సుమారు రూ.కోటి వరకు ఉంటుంది. పరిహారం చెల్లించడం కంటే శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు అవసరం.



వంగిపురంలో నీట నానుతున్న పత్తి పంట

శాశ్వతంగా పరిష్కరించాలి



పంట చేతికొచ్చే లోపు మేం పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. పంట సాగు చేయడం ఒక్కటే మా చేతుల్లో ఉంటుంది. మిగిలినదంతా దైవాధీనం. వానలు ఎక్కువగా కురిస్తే వరద పోటు తప్పదు, తక్కువగా కురిస్తే చివరి భూములైన మాకు చుక్క నీరు రాదు. ఎటు చూసినా ఏటా నష్టాలే. పొలాలు ముంపు బారిన పడకుండా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలి.

– పి. వినోద్‌కుమార్, రైతు, వంగిపురం

పట్టించుకునే వారే కరువు



భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ వరదంతా మా ఊరి మీదకొచ్చి పడటం సర్వసాధారణంగా మారింది. ఇక అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు.. ఇలా వరుసగా చూసివెళ్లడం మామూలే. ఏ ఒక్కరూ శాశ్వత పరిష్కారం చూపిన దాఖలాలు లేవు. ఎంతమందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం మాత్రం శూన్యం.

– చెరుకూరి శ్రీనివాసరావు, రైతు, వంగిపురం

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు



గుంటూరు మెడికల్: వరద బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో అత్యవసర వైద్య సేవలను అందించేందుకు ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 పడకలతో ఈ వార్డును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

నేటి నుంచి యథావిధిగా పాఠశాలలు

గుంటూరు ఎడ్యుకేషన్: భారీ వర్షాల కారణంగా గుంటూరు జిల్లాలో సెలవులు కొనసాగుతున్న అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు గురువారం నుంచి యథావిధిగా పని చేయనున్నాయి. ఈ మేరక జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న పాఠశాలలు, తుపాను బాధితులకు ఆశ్రయం కల్పిస్తున్న బడులకు మినహాయింపు ఇచ్చామన్నారు. ఇతర అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను పునఃప్రారంభించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే విద్యార్థులను గదుల్లోకి అనుమతించాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే సంబంధిత తనిఖీ అధికారికి తెలియపర్చాలని కోరారు. ఈ విషయమై డీవైఈవో, ఎంఈవోలు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వరద బాధితులకు సాయం చేద్దాం రండి


గుంటూరు వెస్ట్: వరదలు, భారీ వర్షాల కారణంగా నష్టపోయిన కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజలను ఆదుకునేందుకు వ్యాపార సంస్థలు, ప్రజలు ఆర్థిక చేయూత అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. దీనికి సంబంధించిన దాతలు పంపాల్సిన బ్యాంకు ఖాతాల వివరాలను ఆమె వెల్లడించారు.

ఖాతా పేరు: కలెక్టర్, డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్, గుంటూరు డిస్ట్రిక్ట్
అకౌంట్ నెంబర్: 3326 0919 895
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఐడీఎఫ్‌బీ0081061
బ్యాంక్: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్

సీఎస్ఆర్ కాంట్రిబ్యూషన్

అకౌంట్ పేరు: డిస్ట్రిక్ట్ కలెక్టర్, గుంటూరు
ఖాతా నెంబర్: 6408 0201 0009 734
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూబీఐఎన్0564087
బ్యాంక్: యూనియన్ బ్యాంక్, కొత్తపేట బ్రాంచ్.

ముంచుతున్న కొండవీటి వాగు



కొండవీటి వాగు ఉధృతికి నీట మునిగిన పత్తి పంట

తాడికొండ: కొండవీటి వాగు వరద ఉప్పొంగడంతో వేల ఎకరాల్లో పంటలు నీటిలో మునిగాయి. రైతులకు తీరని నష్టం వాటిల్లింది. తాడికొండ- కంతేరు, నీరుకొండ- పెదపరిమి గ్రామాల మధ్య కొండవీటి వాగు ఉప్పొంగి పంట పొలాలపై పడటంతో దాదాపు 20 వేల ఎకరాలకు పైగా పంటలు నీటిలో మునిగాయి. వాగును ప్రక్షాళన చేయడంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తున్న కారణంగా ఈ దుస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం తాడికొండ మండలంలో 18 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. ఇందులో 3,155 వేల ఎకరాల్లో పత్తి, 630 ఎకరాల్లో వరి, 595 ఎకరాల్లో మినుము, 25 ఎకరాల్లో పెసర, 40 ఎకరాల్లో కంది, 15 ఎకరాల్లో మిరప, 40 ఎకరాల్లో సోయా చిక్కుడు, 50 ఎకరాల్లో బొప్పాయి, 200 ఎకరాల్లో జూట్ దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఇంకా నీరు ఉన్నందున నష్టం పెరిగే అవకాశం ఉంది.